క్లుప్తంగా

నూతన 108 వాహనానికి పూజలు



నూతన 108వాహనానికి పూజలు చేయిస్తున్న సిబ్బంది

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాకు మంజూరైన నూతన 108వాహనానికి సిబ్బంది ఆదివారం 80బన్నూరు ఆంజనేయస్వామి, శ్రీజంబులాపరమేశ్వరీదేవి ఆలయాల వద్ద పూజలు నిర్వహించి ప్రారంభించారు. 108సిబ్బంది మాట్లాడుతూ 8ఏళ్ల క్రితం జూపాడుబంగ్లాకు 108వాహనం రాగా ఇప్పటిదాకా4.50లక్షల కిలోమీటర్లు తిరిగిందని తెలిపారు. దానిస్థానంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నూతన 108 వాహనాన్ని మండలానికి మంజూరు చేశారని చెప్పారు. నూతన వాహనంలో ఏసీతో పాటు ఆక్సిజన్, పల్స్‌ఆక్సిమీటర్, గ్లూకోమీటర్, కొలాప్స్ స్ట్రెచర్, స్పైన్‌బోర్డు, మానిటర్, సిరంజిన్‌పంపు తదితర ప్రథమచికిత్స పరికరాలున్నట్లు తెలిపారు. పాత వాహనాన్ని త్వరలో ప్రభుత్వానికి స్వాధీనం చేయనున్నట్లు వెల్లడించారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో టాటా మ్యాజిక్ ఆటో యూనియన్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక ప్రైవేటు ఫైనాన్స్‌ల వద్ద అప్పులు చేసి ఆటో నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అనంతరం టాటా మ్యాజిక్ ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా కే.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఖాజా, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి సుభాన్‌లతో పాటు 5 మందిని ఎన్నుకున్నారు.

ఓంకారంలో భక్తులసందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారం క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని శ్రీ ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని కాశినాయన అన్నదాన భవనం వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు.

విరాటపర్వం ఎంతో విశిష్టమైనది



హయగ్రీవాచార్యులను సన్మానిస్తున్న పండితులు

మహానంది: అందరికీ మహాభారతం అంటే ఎంతో ఇష్టమని, అందులోనూ భారతంలోని విరాటపర్వం మరింత విశిష్టమైందని నంద్యాలకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు దివి హయగ్రీవాచార్యులు తెలిపారు. మహానంది క్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగిన విరాటపర్వం పారాయణం ఆదివారంతో ముగిసింది. ఈ మేరకు మూడురోజుల పాటు పారాయణం చేసిన ఆయనను ఆలయ వేద పండితులు రవిశంకర అవధాని, అధికారులు సన్మానించారు. స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

నేడు నాగటూరులో 'గడప గడపకు'

నందికొట్కూరు: మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో సోమవారం గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తునట్లు ఆదివారం సింగిల్ విండో చైర్మన్ సగినేల హుసేనయ్య తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు తప్పని సరిగా మధ్యాహ్నం 3. 30 గంటలకు హాజరుకావాలన్నారు.

కడమలకాల్వలో వాటర్ ప్లాంటుకు మరమ్మతులు



ఆర్‌ఓ ప్లాంట్‌ను సిద్ధం చేస్తున్న మండల పరిషత్ అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో అతిసార వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓఆర్‌డీ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం గ్రామానికి చేరుకుని గ్రామంలోని మినరల్‌వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేశారు. వీటిని సోమవారం ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే గ్రామంలో అతిసారం తగ్గుముఖం పట్టేందుకు చర్యల్లో భాగంగా మంచినీటిని ట్యాంకర్లతో రవాణా చేస్తూ ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ప్రజలు సైతం సహకరించి నీరును కాచి వడగట్టుకోవడంతో పాటు బయట నుంచి తెచ్చుకునే విషపూరిత ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

రైతు భరోసా కేంద్రంలో ఎరువులు కొనుగోలు చేశాం



నా పేరు వెంకటేశ్వరనాయక్, నాది ఎస్ఎన్‌తండా, ఆత్మకూరు మండలం, సిద్ధాపురం చెరువు కింద ఈ ఏడాది ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించాం. వరి, మొక్కజొన్న పంటలు వేసేందుకు సిద్ధమయ్యాం. ఈ పంటలకు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు వినియోగించాల్సి ఉంటుంది. ఈ ఎరువులన్నీ మా ఊరి ఆర్బీకేలో తీసుకున్నాం. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్బీకేల వలన ఎరువుల కొనుగోలు చాలా సులభతరమైంది. ఈ ఏడాది రెండు సార్లు ఆర్బీకేలోనే ఎరువులను కొనుగోలు చేశా. మండల కేంద్రానికి వెళ్లే వ్యయప్రయాసలు తప్పాయి.

పుష్కలంగా ఎరువులు

- యూరియా, కాంపోస్ట్ ఎరువులకు కొరతలేదు
- ఆర్బీకేల్లో, ప్రైవేట్ దుకాణాల్లో టన్నుల కొద్ది నిల్వలు
- మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లోని ఆర్బీకేల్లో లభ్యం
- రైతులకు తప్పిన వ్యయప్రయాసలు



ఆత్మకూరులోని ఓ దుకాణంలో నిల్వ ఉన్న ఎరువులు

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి రైతులకు కావాల్సిన ఎరువులు పుష్కలంగా లభిస్తున్నాయి. ఆర్బీకేలు, ప్రైవేటు దుకాణాల్లో టన్నులకొద్ది నిల్వలు ఉన్నాయి. గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు ఉన్న గ్రామాల్లోనే ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఎరువుల కోసం మండల, తాలూకా కేంద్రాలకు వెళ్లి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం పల్లెల్లోనే ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా పంటలకు కావాల్సిన యూరియా, కాంపోస్ట్, పొటాష్ లాంటి ఎరువులు అందుబాటులో ఉంచింది.

ఎరువుల నిల్వలు..

ఆత్మకూరు మండలంలో ఆర్బీకే కేంద్రాల్లో అన్ని రకాలకు చెందిన ఎరువులు 1100 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ దుకాణాలలో 3,450 క్వింటాళ్లు, వెలుగోడు మండలంలో ఆర్బీకేల్లో 6,801 క్వింటాళ్లు, ప్రైవేట్ దుకాణాల్లో 4,000 క్వింటాళ్లు , పాములపాడు మండలంలో ఆర్బీకేల్లో 899, ప్రైవేట్ దుకాణాల్లో 4,200 క్వింటాళ్లు, కొత్తపల్లి మండలంలో ఆర్బీకేలో 1000, ప్రైవేట్ దుకాణాల్లో 1,280 క్వింటాళ్ల చొప్పున ఎరువులు నిల్వ ఉన్నాయి. ప్రస్తుతం ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా 309 క్వింటాళ్లు, డీఏపీ 1,300 క్వింటాళ్లు , ఇతర కాంప్లెక్స్ ఎరువులు 480 క్వింటాళ్లు , వెలుగోడు మండలంలో యూరియా 29 , డీఏపీ 159, కాంప్లెక్స్ 4 క్వింటాళ్లు , పాములపాడులో యూరియా 299, డీఏపీ 850, కొత్తపల్లి మండలంలో యూరియా 1,023, డీఏపీ 300 క్వింటాళ్లు , 4 క్వింటాళ్ల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఈ నెలలో భారీ స్థాయిలో 9,801 క్వింటాళ్ల ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచనున్నారు.

ఎమ్మార్పీకే విక్రయాలు

రైతులకు కావాల్సిన ఎరువులు ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఎమ్మార్పీకే ఆర్బీకే, ప్రైవేట్ దుకాణాల్లో లభ్యం అవుతున్నాయి. డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 3,507 క్వింటాళ్ల ఎరువులు సరఫరా చేయగా, ఇందులో ఇప్పటి వరకు 3,309 క్వింటాళ్లు రైతులు కొనుగోలు చేశారు. ఇంకా రైతు భరోసా కేంద్రాలు, ఎరువుల దుకాణాల వద్ద 198 క్వింటాళ్ల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు యూరియా రూ.267 చొప్పున విక్రయిస్తున్నారు. మిగిలిన కాంపోస్ట్ ఎరువుల కూడా ప్రభుత్వ నిర్ణయించిన ఎమ్మార్పీకే అమ్మకాలు చేయడం రైతులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు.

ఎరువులకు ఇబ్బందేలేదు



ఈ ఏడాది ఖరీఫ్ సాగు ప్రారంభమైనప్పటి నుంచి రైతులకు కావాల్సిన ఎరువులు పుష్కలంగా లభిస్తున్నాయి. ఏ ఎరువులు కావాలన్నా..ఆర్బీకేల్లో, ప్రైవేట్ దుకాణాల్లో లభ్యం అవుతున్నాయి. రైతులకు ఎప్పుడు ఎరువులు కావాల్సి వస్తే అప్పుడు కొనుగోలు చేస్తున్నారు. ఎరువుల గురించి ఇబ్బంది పడలేదు.

– మహబూబ్‌బాషా, ఆత్మకూరు రైతు భరోసా కేంద్రం చైర్మన్

అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం



ఆత్మకూరు డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎక్కడా ఎరువుల కొరత లేదు. రైతులకు కావాల్సిన ఎరువులు ఆర్బీకే, ప్రైవేట్‌దుకాణాల్లో పుష్కలంగా ఉన్నాయి. ఎవరైనా ఎమ్మార్పీల కంటే అధికంగా విక్రయిస్తే రైతులు తమకు ఫిర్యాదు చేస్తే ఆ దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తాం. రైతులకు ఎంత అవసరం అయితే అంత స్థాయిలో ఎరువులను ఆర్బీకేలకు సరఫరా చేస్తాం.

– ఆంజనేయులు , ఏడీఏ , ఆత్మకూరు

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

ఆత్మకూరు: దేశంలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు ధరలు, గ్యాస్, విద్యుత్‌చార్జీలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, వీటిని వెంటనే నియంత్రించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సుదర్శన వర్మభవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూరగాయలు , నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. టమాట, మిర్చి కొనలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

ఆత్మకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఒప్పంద అధ్యాపకుల జేఏసీ ఫైనాన్స్ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన ఒప్పంద అధ్యాపకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 2012 నుంచి పనిచేస్తూ 10 సంవత్సరాలు సరీ్వసును పూర్తి చేసుకున్న వారందరినీ రెగ్యులర్ అధ్యాపకులుగా నియమించాలన్నారు.

14న జాబ్‌మేళా

పాములపాడు: నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 14న నిర్వహించనున్నట్లు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో విడుదల చేసింది. ఎమ్మెల్యే ఆర్థర్ ప్రోద్బలంతో నంద్యాల జిల్లా వృత్తి నైపుణ్యాభి సంస్థ వారు ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పిల్లలకు మంచి, చెడు తెలియజేయాలి



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప, పక్కన ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి

జూపాడుబంగ్లా: తల్లిదండ్రులు పిల్లలకు మంచి, చెడులను తెలియజేసి క్రమశిక్షణతో మెలిగేలా చేయాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప తెలిపారు. ఆదివారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు మొదటి గురువులు తల్లిదండ్రులన్నారు. పిల్లలకు మంచి, చెడులను తెలియజేసి క్రమశిక్షణతో పెంచి పాఠశాలకు పంపాలన్నారు. ఉపాధ్యాయులు వారికి విద్యాబోధన చేసి భావిభారత పౌరులుగా, ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతారని తెలిపారు.

రూ.10వేల విలువైన వీధిదీపాలు, లైట్ల అందజేత

కర్నూలు పట్టణానికి చెందిన చిట్టిబాబు అనే వ్యక్తి పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు వీధి దీపాలు, గదుల్లో ఏర్పాటు చేసేందుకు ట్యూబ్‌లైట్లు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వీటి విలువ రూ. 10వేలు ఉంటుందన్నారు. ఆయనకు పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఎంసీ వైస్ చైర్మన్ జయన్న తదితరులు పాల్గొన్నారు.

నీళ్లుండీ నిరుపయోగం



నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో మసీదు సమీపంలో బోరులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ నిరుపయోగంగా మారింది. సంవత్సరాల తరబడి నిర్వహణ పట్టించుకోకపోవడంతో చేతి పంపు తుప్పు పట్టింది. దీంతో కాలనీవాసులకు వినియోగించుకునేందుకు వీల్లేకుండా పోయింది. చేతి పంపుకు పైపులు, హ్యాండిల్ ఏర్పాటు చేసి కాలనీవాసులకు నీటినందించాలని ప్రజలు కోరుతున్నారు.

శరవేగంగా నూతన హాస్పిటల్ నిర్మాణం




చివరి దశలో ఉన్న నూతన ఆసుపత్రి భవననిర్మాణ పనులు

జూపాడుబంగ్లా: నాడు-నేడు పథకం కింద రూ.1..80కోట్ల నిధులు వెచ్చించి చేపట్టిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవన నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పనులు పూర్తికావాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో నెమ్మదించాయి. ఈ నేపథ్యంలో అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయటంతో పనులు వేగవంతం అయ్యాయి. భవననిర్మాణం పూర్తికాగా లోపల బండపరుపు, టైల్స్, టాయ్‌లెట్ల నిర్మాణం, డోర్లు అమర్చడం, కిటికీల ఏర్పాటు వంటి పనులు కొనసాగుతున్నాయి. అలాగే కాంపౌండ్ వాల్ నిర్మాణం పనులు కూడా ప్రారంభం అయ్యాయి. పనులను ఆగస్టులోగా పూర్తిచేసి నూతన ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఆదిదంపతులకు మేఘాల పందిరి !

మహానంది: పరమేశ్వరుడిని ప్రకృతి సైతం ఆరాధించింది. నీలకంఠుడికి నింగి నీడను పట్టింది. ఆదిదంపతులకు మేఘాలు పందిరి వేశాయి. దీంతో మహానంది అందాలు మహా(ఆ)నందంగా మారాయి. మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామివార్ల గర్భాలయ గోపురాలపై ఆదివారం కనిపించిన ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరాలో బంధించింది.



స్వామి,అమ్మవారి ఆలయాలపై మేఘాల పందిరి

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నంద్యాల(అర్బన్): దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వడ్డెర కులస్తులను డీపీఏ నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాలని నంద్యాల జిల్లా వడ్డెర సంఘం నాయకుడు చల్లా వెంకటేష్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ గతంలో మంత్రి వర్గం తీర్మానం చేసి పార్లమెంట్ ఆమోదానికి పంపారని గుర్తు చేశారు. ఇంత వరకు పార్లమెంట్‌లో ఆమోదం పొందలేదని, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని బిల్లు ఆమోదం పొందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని జగజ్జననీ మాతకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో సారె సమర్పించారు.అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి చీర, సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

బొమ్మలసత్రం: జిల్లాలో ఉన్న రౌడీషీటర్లు, పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా బహిష్కరణ తప్పదని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. పాత నేరస్తులపై నిఘా పెంచడంతో పాటు రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు.

జాతీయ పునర్నిర్మాణమే ఏబీవీపీ లక్ష్యం

వెలుగోడు: జాతీయ పునర్నిర్మాణమే ఏబీవీపీ లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్న నరసింహులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం నంద్యాల జిల్లా ప్రముఖ్ అన్నెం పార్థసారథి రెడ్డి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కో- కన్వీనర్ రవికిశోర్ రెడ్డి, నంద్యాల జిల్లా బాగ్ కన్వీనర్ దుర్గ, అక్రమ్, మధు గౌడ్ పాల్గొన్నారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు రూరల్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు కోరారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమానికి మండల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

కోలుకోలేక మహిళ మృతి

మిడుతూరు: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఓ మహిళ మృతిచెందినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కడుమూరు గ్రామానికి చెందిన మంగమ్మ (68) 30వ తేదీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తోటీ కూలీలతో కలిసి అదే గ్రామానికి ఈశ్వర్రెడ్డి పొలం వద్ద చెక్‌డ్యాం పూడికతీత పనులకు వెళ్లింది. పని ప్రదేశంలో పాము కాటుకు గురైంది. వెంటనే ఆమెను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలికి భర్త గొల్ల బాలమద్దిలేటి, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

మల్లన్నను దర్శించుకున్న సినీనటి రవళి



స్వామిఅమ్మవార్ల దర్శనం అనంతరం కుటుంబసభ్యులతో సినీ నటి రవళి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సినీ నటి రవళి ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో శ్రీశైలం వచ్చిన వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

అడుగడుగునా అక్రమ మోటార్లు

- కేసీ నీటిని అక్రమంగా వాడుకుంటున్న నాన్‌ఆయకట్టు రైతులు
- దిగువ ప్రాంతానికి తప్పని సాగునీటి కష్టాలు
- మోటార్లకు విద్యుత్ కనెక్షన్లపై అనుమానాలు



కొత్త తూముకు ఎదురుగా కేసీ కాలువకు అమర్చిన విద్యుత్ బోర్డు , పక్కన వ్యవసాయ మోటారు



ముచ్చుమర్రి వద్ద కేసీ కాలువకు అమర్చిన విద్యుత్ మోటార్లు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ నుంచి పడమర ప్రాతకోట గ్రామాల మధ్య కేసీ కాలువకు అక్రమ మోటార్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆయకట్టు రైతులకు కర్నూలు-కడప కాలువ వరదాయినిగా ఉంది. ఈ కాలువ నీటిని అక్రమంగా తరలించేందుకు నాన్ ఆయకట్టు రైతులు పోటీ పడుతున్నారు. ఇందుకు నీటిపారుదల శాఖ అధికారులు, విద్యుత్ అధికారులు సహకరించడం వల్లే నాన్ ఆయకట్టుకు కేసీ నీటిని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి. అడుగడుగునా అక్రమ మోటార్లు వెలుస్తున్నందున దిగువ ప్రాంతానికి సాగునీటి కష్టాలు తప్పడం లేదని కేసీ పరివాహక గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాన్ ఆయకట్టు 1500 ఎకరాలు ఉంటుంది

మండలంలోని కేసీ పరివాహకం వెంట నాన్ ఆయకట్టుకు దాదాపు 1500 ఎకరాలకు అక్రమ మోటార్ల ద్వారా నీటిని వినియోగిస్తున్నారు. ఈ సాగును కూడా ఆయకట్టు కింద చూపిస్తూ రెవెన్యూ అధికారులకు నీటి పన్నులు వసూలు చేయాలని రికార్డు ప్రకారంగా పంపిస్తున్నాం. ఏటా సుమారు రెండు తూముల నీళ్లు నాన్ ఆయకట్టు రైతులు వాడుకుంటున్నారు.

– నరేష్, నీటిపారుదల ఏఈఈ, పగిడ్యాల

అక్రమ మోటార్లకు సక్రమ విద్యుత్ కనెక్షన్?

బావి, బోరు ఉంటేనే విద్యుత్ కనెక్షన్ ఇస్తామని చెప్పే విద్యుత్ అధికారులు ఏకంగా కేసీ కాలువ నీటిని వినియోగించేందుకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశమైంది. నాన్ ఆయకట్టు రైతులకు అడ్డుకట్ట వేయకపోతే కేసీ కాలువ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని శాశ్వత ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కేసీ కాలువకు నీటి విడుదల లేనందున అక్రమ మోటర్లను తొలగించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కేసీ పరివాహక రైతులు కోరుతున్నారు.

అనధికార వెంచర్లు..యథేచ్ఛగా విక్రయాలు

జూపాడుబంగ్లా: మండలంలోని తర్తూరు గ్రామ అంచవద్ద అక్రమంగా వెంచర్‌ను ఏర్పాటుచేసి యథేచ్ఛగా ప్లాట్లను విక్రయిస్తున్నా రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ, కుడా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. భూమిని కొంత మంది చౌకధరకు రైతుల నుంచి కొనుగోలు చేసి వ్యవసాయ భూమిని ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోకుండానే ప్రైవేటు సర్వేయర్లతో లేఅవుట్ తయారు చేయించి అక్రమంగా వెంచర్లు వేశారు. ఒక్కో ప్లాటు 3సెంట్ల నుంచి 18సెంట్లుగా విభజించి వెంచర్‌లో 28 ప్లాట్లను ఏర్పాటు చేశారు. సెంటు రూ.3 లక్షల నుంచి 5లక్షల వరకు విక్రయించి రూ.కోట్లు సొమ్ముచేసుకొంటున్నా అధికారులు అటువైపు కన్నెత్తిచూడకపోవటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వెంచర్‌లో వ్యాపారులు చెప్పే మాయమాటలను నమ్మి ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు మోసపోతున్నారు. ప్రజలు మరింత మంది మోసపోకముందే అధికారులు చర్యలు తీసుకొని అక్రమ వెంచర్లలో ప్లాట్ల విక్రయాలను నిలుపుదలచేయించాల్సిన అవసరం ఎంతైనాఉంది.



తర్తూరు అంచెవద్ద ఎలాంటి అనుమతుల్లేకుండా ఏర్పాటుచేసిన వెంచర్

వెంచర్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చాం

అక్రమ వెంచర్ల విషయమై తహసీల్దార్ పుల్లయ్య యాదవ్‌ను సంప్రదించగా ఇప్పటదాకా వెంచర్ వేసిన వారు ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోలేదని తెలిపారు. ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోకుండా ప్లాట్లు విక్రయించవద్దని వెంచర్ నిర్వాహకులకు ఇదివరకే నోటీసులు జారీచేశామని చెప్పారు. స్పందించకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.



పాలెంచెరువు గూడెం సమీపంలో ట్రాక్టర్‌తో వరివిత్తనాలు వేస్తున్న దృశ్యం



నందికుంట సమీపంలో ఆరుతడి పంటలకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతన్న

విత్తనసాగులో రైతన్నలు బిజీ

- ముమ్మరంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటల సాగు పనులు
- వరణుడు కరుణించడంతో ఖరీఫ్‌కు రైతన్న సిద్ధం

కొత్తపల్లి: వరణుడు కొద్దిగా ఒరుపు ఇవ్వడంతో ఖరీఫ్ విత్తనసాగులో రైతన్నలు బిజీ అయ్యారు. గత మూడురోజులుగా వర్షాలు కురియడంతో పొలాలు విత్తనాలు వేసుకునేందుకు అదునయ్యాయి. ఇప్పటికే ఆలస్యం అయిందనుకున్న రైతన్నలు వెంటనే ఖరీఫ్ సాగుకు విత్తనాలు వేసేందుకు ఉపక్రమించారు. కాడెద్దులతో, ట్రాక్టర్లతో పొలాలను దున్ని విత్తనాలు వేస్తున్నారు. మండలంలోని లింగాపురం, గోకవరం, కొత్తమాడుగుల, దుద్యాల, నందికుంట, బావాపురం, శివపురం ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాలలో రైతులు మొక్కజొన్న, పత్తి పంటలను సాగుచేస్తున్నారు. అదేవిధంగా బండినాయినిపాలెం, గువ్వలకుంట్ల, వీరాపురం, కొత్తపల్లి, శివపురం, గుమ్మడాపురం గ్రామాలలో చెరువులక్రింద, శివబాష్యం సాగర్ ప్రాజెక్ట్ కింద వరి సాగుకు రైతన్నలు ముందుకు వచ్చారు. ఇప్పటికే సుమారు 300 ఎకరాలలో వరి సాగు అవుతుంది. మరికొంత మంది రైతులు ముందస్తుగా సాగుచేసుకున్న పంటలకు వర్షం ప్రాణం పోసిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యంగానైనా మంచి వర్షాలు పడడంతో రైతన్నల కళ్లలో ఆశ చిగురించాయి.